సాక్షి
యాదాద్రి భువనగిరి

సోమవారం। 18। సెప్టెంబర్। 2023



పోటెత్తిన భక్తులు
యాదాద్రి క్షేత్రంలో భక్తుల రద్దీ నెలకొంది. 25 వేలకు పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. - 8లో



స్కేటింగ్ పోటీలు..
భువనగిరిలోని న్యూ డైమెన్షన్ స్కూల్‌లో రోలర్ స్పీడ్ స్కేటింగ్ పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. - 8లో



హరిత జిల్లాగా తీర్చిదిద్దుతాం
సూర్యాపేటను హరిత జిల్లాగా తీర్చిదిద్దుతామని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి పేర్కొన్నారు. - 8లో

న్యూస్‌రీల్

20న తలనీలాల వేలం

బీబీనగర్ : మండలంలోని పడమటి సోమారం గ్రామంలో గల శ్రీలింగబస్వేశ్వర ఆలయానికి సంబంధించి తలనీలాలతో పాటు టెంట్ సామగ్రి, కొబ్బరికాయల విక్రయం కోసం ఈనెల 20న బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు ఆలయ ఆవరణలో నిర్వహించే వేలంలో పాల్గొనాలని ఈఓ నరేందర్‌రెడ్డి ఆదివారం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వంట ఏజెన్సీలకు బిల్లులు విడుదల

భువనగిరి : జిల్లాలో మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీలకు ప్రభుత్వం బిల్లులు విడుదల చేసినట్లు డీఈఓ నారాయణరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 1నుంచి 8వ తరగతి వరకు రూ.5,31,200, సీసీహెచ్ హానరోరియమ్‌కు రూ.27.88 లక్షలు విడుదలైనట్లు పేర్కొన్నారు. నిధులను ఎంఈఓల ఖాతాల్లో జమ చేస్తామని, అక్కడి నుంచి వంట కార్మికులకు చెల్లించనున్నట్లు తెలిపారు.

గూడూరు టోల్‌ప్లాజాకు వాహనాల తాకిడి



భువనగిరి వైపు నిలిచిన వాహనాలు

బీబీనగర్ : మండల పరిధిలోని గూడూరు టోల్‌ప్లాజా వద్ద ఆదివారం వాహనాల రద్దీ నెలకొంది. రెండు రోజులు పాటు వరుస సెలవులు రావడం, వినాయ చవితి నేపథ్యంలో హైదరాబాద్ జంటనగరాల నుంచి ప్రజానీకం స్వగ్రామాలకు తరలివెళ్లారు. దీంతో పాటు యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి భక్తులు భారీగా రావడంతో ఉదయం భువనగిరి వైపు వాహనాలు బారులుదీరాయి. దీంతో టోల్‌ప్లాజా యాజమాన్యం అదనంగా మరో రెండు కౌంటర్లను తెరిచింది. అయినా ఫాస్టాగ్ స్కానింగ్ ఆలస్యం కావడంతో వాహనాలు నెమ్మదిగా కదిలాయి. ఒక్కో వాహనదారుడు అరగంట వరకు వేచి వుండాల్సి వచ్చింది.

స్నేహితుడి కుటుంబానికి రూ.15 లక్షల ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్

మోత్కూరు : సంస్థాన్ నారాయణపురం సర్వేల్ గురుకుల పాఠశాలకు చెందిన 1995–96 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన వేణుశర్మ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. సర్వేల్ ఆల్మని అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.15 లక్షలు సేకరించి బాధిత కుటుంబానికి అందజేశారు. హైదరాబాద్‌లో వారి నివాసానికి వెళ్లి సర్వేల్ గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థి, తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ చేతుల మీదుగా ఆర్థిక సాయం అందజేశారు. వేణుశర్మ కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర రెడ్డి, ఉపాధ్యక్షుడు మల్లేషం, కోశాధికారి వివేక్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ జంపాల రాజు, జాయింట్ సెక్రెటరీ కృష్ణయ్య, పూర్వ విద్యార్థులు భిక్షపతి, శ్రీనివాస్, వాసు, మల్లిక్, నరేష్, సైదులు, నాగన్న, శ్రీను, మురళీ తదితరులు పాల్గొన్నారు.

తెగిన కాల్వ కట్ట



బునాదిగాని కాల్వ కట్ట తెగడంతో వృథాగా పోతున్న సాగు నీరు

ఆత్మకూరు(ఎం) : మండల పరిధిలోని రహీంఖాన్‌పేట వద్ద బునాదిగాని కాల్వ కట్ట తెగడంతో వారం రోజులుగా నీరంతా వృథాగా పోతోంది. నెలరోజుల క్రితం కాల్వ ఎగు భాగంలో పోసానికుంట వద్ద కట్ట తెగి పొలాల్లోకి నీరు చేరుతుండడంతో ప్రభుత్వ విప్ గొంగిడి సునీత చొరవచూపి సమస్యను పరిష్కరించారు. సాగునీరు సాఫీగా వెళ్లేలా దిగువన కాల్వకు అడ్డుగా ఉన్న మట్టిని తొలగించి పైపులు వేయించారు. వారం రోజుల క్రితం రహీంఖాన్‌పేట వద్ద కట్ట తెగింది. పొలాలు నీట మునుగుతుండడంతో రైతులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఐబీ అధికారులు ఆదివారం కట్ట తెగిన ప్రాంతాన్ని పరిశీలించారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

సాయుధ పోరాటమే స్ఫూర్తి



మాట్లాడుతున్న విప్ సునీత

జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, చిత్రంలో డీసీపీ రాజేశ్‌చంద్ర



గిరిజన సంప్రదాయ నృత్యం చేస్తున్న విద్యార్థినులు

- అనతికాలంలోనే తెలంగాణ అద్భుత ప్రగతి సాధించింది
- సంక్షేమ రంగంలో దేశానికే ఆదర్శంగా నిలిచాం
- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత
- కలెక్టరేట్‌లో ఘనంగా తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం

సాక్షి, యాదాద్రి : 'తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రం అనతికాలంలో అద్భుతమైన ప్రగతి సాధించింది. అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. రెట్టింపు ఉత్సాహంతో అందరం కలిసికట్టుగా శ్రమించి బంగారు తెలంగాణ కలను సాకారం చేసుకుందాం' అని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల గౌరవందనం స్వీకరించారు. తెలంగాణ సాయుధ, రైతాంగ పోరాటం, స్వాతంత్ర్యోద్యమంలో అసువులుబాసిన అమరవీరులకు జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేడు మనం స్వేచ్ఛగా జీవిస్తున్నామంటే ఎంతోమంది ప్రాణత్యాగాల ఫలితమేనన్నారు. నాడు జరిగిన ప్రజాపోరాటాల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా కీలక భూమిక పోషించిందన్నారు. రావి నారాయణరెడ్డి, భీంరెడ్డి నర్సింహారెడ్డి, బొమ్మగాని ధర్మభిక్షం, ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి, కట్కూరి రామచంద్రారెడ్డి వంటి మరెందరో త్యాగధనులు తెలంగాణలో స్వాతంత్రోద్యమాన్ని ప్రభావితం చేశారని పేర్కొన్నారు. బండి యాదగిరి రాసిన 'బండెనకబండి కట్టి పదహారు బండ్లు కట్టి.. ఏ బండ్ల పోతావు కొడుకో.. నైజాం సర్కారోడో' పాటకు సాయుధ పోరాటంలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. దొడ్డి కొమురయ్య అమరత్వంతో తెలంగాణ సాయుధ పోరాటం ఉధృతరూపం దాల్చి చివరికి నిజాం నుంచి విముక్తి లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, డీసీపీ రాజేశ్‌చంద్ర, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి, రెవెన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, భువనగిరి మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అమరేందర్ గౌడ్, జిల్లా రైతు సమన్వయ సమితి కన్వీనర్ అమరేందర్, ఆర్డీఓ అమరేందర్, ఏసీపీ వెంకట్‌రెడ్డి, ఉద్యోగ సంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు మందడి ఉపేందర్‌రెడ్డి, ఎంపీపీ నరాల నిర్మల, జెడ్పీటీసీ బీరు మల్లయ్య, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

కేసీఆర్ నాయకత్వంలో వీరోచితంగా సాగిన తెలంగాణ మలిదశ ఉద్యమం ద్వారా స్వరాష్ట్రం సిద్ధించిందని గొంగిడి సునీత తెలిపారు. సంక్షేమ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న ఘనత తెలంగాణదేనన్నారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యమన్నారు. విద్యుత్ ఇబ్బందులను తొలగించేందుకు నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద 4,000 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజలంతా బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు.



జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



దేశభక్తి గీతానికి నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

● మట్టి వినాయకుడికి జై



మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

భువనగిరి : జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో భువనగిరిలో ఆదివారం అదనపు కలెక్టర్ వీరారెడ్డి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని కోరారు.

మంత్రి వినాయక చవితి శుభాకాంక్షలు



మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట: ప్రజలంతా సుఖశాంతులతో జీవించేలా.. ఆ ఏకదంతుని దీవెనలు అందాలని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ప్రార్థించారు. వినాయక చవితి సందర్భంగా మంత్రి ఆదివారం ఒక ప్రకటనలో ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సకల శాస్త్రాలకు అధిపతిగా, బుద్ధికి–జ్ఞానానికి ఆరాధ్యుడిగా, ఆటంకాలను తొలగించే విఘ్నేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో ఆరాధించాలని పేర్కొన్నారు. ఈ గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో సౌభ్రాతృత్వం, సోదరభావం వెల్లివిరిసేలా ఆనందంతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఎవరెన్ని ఆటంకాలు సృష్టించినా వాటిని వినాయకుని దీవెనలతో అధిగవిస్తూ సకల జనుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని తెలిపారు.

పరిహారం రూ.109 కోట్లు

తేలిన బీఎన్ తిమ్మాపూర్ ముంపు లెక్క

- గ్రామ కంఠం, ఇళ్లు, ఇతర ఆస్తులకు చెల్లించాలని నిర్ణయం
- రిజర్వాయర్‌లో నీటి నిల్వకు తొలగిన అడ్డంకి



ముంపునకు గురికానున్న బీఎన్ తిమ్మాపూర్ వ్యూ

సాక్షి, యాదాద్రి : బస్వాపూర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న బీఎన్ తిమ్మాపూర్ గ్రామస్తులకు త్వరలో పరిహారం అందనుంది. గ్రామ కంఠంలో ఉన్న పక్కా ఇళ్లు, ఇతర నిర్మాణాలు, వివిధ రకాల చెట్లు, నీటి వసతి, ఖాళీ స్థలాల నష్టపరిహారం లెక్క తేలింది. రూ.109 కోట్లు చెల్లించాలని అధికారులు తాజాగా నిర్ధారించారు. రెవెన్యూ శాఖ పాస్ చేసిన అవార్డును నీటి పారుదల అధికారులకు అందజేశారు. నిర్వాసితులకు పరిహారం డబ్బులు చెల్లిస్తేనే గ్రామాన్ని ఖాళీ చేయించే అవకాశం ఉంది.

తొలగనున్న సమస్య

ముంపు గ్రామాలకు పరిహారం చెల్లించడంలో జరుగుతున్న జాప్యం కారణంగా రిజర్వాయర్ పనులకు అడ్డంకిగా మారింది. తొలి విడత పనులు త్వరగా పూర్తి చేసి రిజర్వాయర్‌లో నీటిని నింపాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు ముంపు లెక్క తేల్చి రూ.109 కోట్లుగా నిర్ధారించారు. గ్రామంలో 877 మంది భూ నిర్వాసితులు, ఇళ్లు కోల్పోతున్న వారు ఉన్నారు. ఇళ్లు కోల్పోతున్న వారికి రూ.87.36 కోట్లు, భూములు, ఖాళీ ప్లాట్లకు రూ.19.55 కోట్లు, రోడ్లు, మంచినీటి బోర్లు, బావులు, ట్యాంకులు ఇతర వనరులకు రూ.2.19 కోట్లు, పండ్లు, తాటి, ఈత చెట్లకు పరిహారం నిర్ధారించారు. అయితే రిజర్వాయర్‌లో బీఎన్ తిమ్మాపురంతో పాటు లక్ష్మీనాయకునితండా, చోగ్లాతండాలు కూడా మునిగిపోనున్నాయి. వారికి ఆర్‌అండ్‌ప్యాకేజీ, పరిహారం చెల్లించాలి ఉంది.

భూములకు ఎప్పుడో ?

బస్వాపూర్ రిజర్వాయర్ కోసం భువనగిరి మండలంలోని బీఎన్ తిమ్మాపూర్, బస్వాపూర్, వడపర్తి, రుస్తాపూర్, హుస్సేనాబాద్, యాదగిరిగుట్ట మండలంలో జంగంపల్లి, దాతరుపల్లి నుంచి సుమారు 4,323 ఎకరాల భూసేకరణకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో 2,602 ఎకరాలకు పరిహారం చెల్లించింది. ఇంకా 1,721ఎకరాలకు పెండింగ్ ఉంది. నిర్వాసితులు పరిహారం కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

శ్రీవిరాట్ విశ్వకర్మకు ఘన నివాళి



విశ్వకర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గొంగిడి సునీత, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి : శ్రీవిరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని ఆదివారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ గొంగిడి సునీత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, డీసీపీ రాజేశ్‌చంద్రతో కలిసి విశ్వకర్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు, ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ అమరేందర్ గౌడ్, జిల్లా రైతు సమన్వయ సమితి కన్వీనర్ అమరేందర్, భువనగిరి ఆర్డీఓ అమరేందర్, ఏసీపీ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు, ఎంపీపీ నరాల నిర్మల, జెడ్పీటీసీ బీరు మల్లయ్య, బీసీ సంఘం నాయకులు కొడారి వెంకటేష్, భట్టు రామచంద్రయ్య, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రావి నారాయణరెడ్డి పేరు పెట్టాలి



మాట్లాడుతున్న ఎండీ జహంగీర్

భువనగిరి : నాగిరెడ్డిపల్లి రైల్వే స్టేషన్‌కు రావి నారాయణరెడ్డి పేరు పెట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ కోరారు. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల్లో భాగంగా భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లిలోని రావి నారాయణరెడ్డి స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంతో పాటు ట్యాంక్‌బండ్‌పై రావినారాయణరెడ్డి విగ్రహాలు ఏర్పాటు చేస్తామని గతంలో బొల్లేపల్లిలో జరిగిన కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీ అమలు చేయాలన్నారు.తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కమ్యూనిస్టులను నిజమైన వారసులుగా భావించాలన్నారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాటం జరిగితే ఆ పోరాటాన్ని బీజేపీ మత కోణంతో చూడడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు గౌడ్, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గద్దం వెంకటేష్, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి వనం రాజు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ముత్యాలు పాల్గొన్నారు.

యాదాద్రిలో శాస్త్రోక్త పూజలు



బీఎస్ఎస్ఎఫ్ చైర్మన్‌కు, హైదరాబాద్ హ్యాండ్ బాల్ సంఘం అధ్యక్షుడికి ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం నిత్యారాధనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవ , అనంతరం స్వయంభూ నారసింహులకు బిందే తీర్థం, ఆరాధన, బాలభోగం, నిజాభిషేకం, సహస్ర నామార్చన గావించి తులసీ దళాలతో అర్చించారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజ వాహన సేవ, నిత్య కల్యాణం, జోడు సేవలు విశేషంగా జరిపించారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

స్వామివారి సేవలో ప్రముఖులు

నృసింహుడిని మాస్క్ మ్యాన్ ఆఫ్ ఇండియా, బీఎస్ఎస్ఎఫ్ చైర్మన్ బస్వరాజు శ్రీనివాస్, హైదరాబాద్ హ్యాండ్ బాల్ సంఘం అధ్యక్షుడు చామల ఉదయ్ చందర్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం ఎమ్మెల్యే కందూరు నాగార్జునరెడ్డి దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభూలకు ప్రత్యేక పూజలు చేశారు.

పేదల ఆరోగ్యానికి భరోసా!

- ఆరోగ్యశ్రీ వ్యయ పరిమితి రూ.2 లక్షల నుంచి రూ.5లక్షలకు పెంపు
- లబ్ధిదారులకు డిజిటల్ కార్డులు
- ఈ–కేవైసీ నమోదు తప్పనిసరి
- 30వ తేదీ వరకు గడువు



ఈ–కేవైసీ చేసుకుంటున్న ఆరోగ్యశ్రీ లబ్ధిదారులు

భువనగిరి టౌన్ : దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం అమలు చేస్తుంది. దీని ద్వారా పేద కుటుంబాలకు కార్పొరేట్ వైద్యం అందుతుంది. ఈ పథకం కింద దాదాపు 1,672 వ్యాధులకు చికిత్స అందజేస్తున్నారు. ఇందుకోసం రూ.2 లక్షల దాకా చెల్లిస్తుండగా ఆ మొత్తాన్ని రూ.5 లక్షలకు పెంచింది.

పాత కార్డుల స్థానంలో కొత్తవి..

సేవలను వర్తింపజేయడానికి పాత కార్డుల స్థానంలో డిజిటల్ కార్డులు ఇవ్వాలని నిర్ణయించింది. అందుకోసం ఆరోగ్య శ్రీకి అర్హత కలిగిన ప్రతి కుటుంబం ఈ–కేవైసీ చేయించుకోవల్సి ఉంది. గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న కామన్‌సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)లో ఈ–కేవైసీ చేసుకోవడానికి అనుమతినిచ్చింది. అందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అమలు చేస్తుంది. అందులో భాగంగానే ప్రస్తుతం ఆరోగ్యశ్రీ కలిగి ఉన్న ప్రతి కుటుంబం, తమ రేషన్ కార్డుతో పాటు ఆధార్, దానికి లింకైన మొబైల్ నంబర్, సదరు కుటుంబ సభ్యులందరూ విధిగా కామన్ సర్వీస్ సెంటర్‌కు వెళ్లి ఈ కేవైసీ చేయించుకోవాల్సి ఉంటుంది.ఈ కేవైసీ చేయించుకోవడానికి ఈ నెల 30తో గడువు ముగియనుంది.

ఈ–కేవైసీ నమోదు చేసుకోవాలి

అర్హులందరూ సీఎస్‌సీ కేంద్రానికి వెళ్లి ఈ–కేవైసీ చేసుకోవాలి. ఈకేవైసీ చేయించుకుంటేనే ఆరోగ్య శ్రీ వ్యయం రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు వర్తిస్తుంది. దీంతో పాటు డిజిటల్ కార్డు కుడా వస్తుంది. ఈకేవైసీ నమోదుకు ఈనెల 30వరకు గడువు ఉంది. ఈ అవకాశాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి.
– శ్రీధర్, సీఎస్‌సీ, జిల్లా మేనేజర్

అర్హులు ఇలా..

జిల్లాలో 2,16,994 కుటుంబాలకు గాను 6,16,350 మంది ఆరోగ్య శ్రీ పథకానికి అర్హులుగా ఉన్నారు. లబ్ధిదారుల జాబితాను రూపొందించి ఈకేవైసీ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా తెల్లరేషన్ కార్డు కలిగిన లబ్ధిదారుల వివరాలను ఆరోగ్యశ్రీ పథకంలో పనిచేస్తున్న సీఎస్‌సీ (కామన్ సర్వీస్ సెంటర్)ఆపరేటర్లు, ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డ్ వెబ్‌సైట్‌లో లబ్ధిదారుడి ఆధార్ నంబర్ నమోదు చేయగానే పూర్తి వివరాలు వస్తాయి.

ఆయిల్‌పామ్‌తో ఆర్థికాభివృద్ధి

మోత్కూరు : ఆయిల్‌పామ్‌తో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. మోత్కూరు మండలం సదర్శాపురంలో రైతు చిలుకల కోటి లింగం వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం ఆయిల్‌పామ్ మొక్కలు నాటి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్‌కు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఇందుకోసం రైతులకు సబ్సిడీపై మొక్కలు అందజేయడమే కాకుండా అనేక రకాల రాయితీలు ఇస్తుందన్నారు. ఆయిల్‌పామ్‌లో పత్తి, కంది ఇతర మెట్ట పంటలను అంతరంగా సాగు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు మోత్కూరు మండల కోఆర్డినేటర్ సోంమల్లు, ఆయిల్‌ఫెడ్ జిల్లా అధికారి ప్రవీణ్, హార్టికల్చర్ అధికారి సైదులు, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ మమత, రైతులు పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్ మొక్క నాటుతున్న రామకృష్ణారెడ్డి

ప్రపంచం మెచ్చిన నాయకుడు మోదీ



జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న పీవీ శ్యాంసుందర్‌రావు,నాయకులు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు

భువనగిరి : ప్రపంచం మెచ్చిన నాయకుడు ప్రధాని నరేంద్రమోదీ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు అన్నారు.ఆదివారం ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా భారత్‌కు ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు.మోదీ సర్కార్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దాసరి మల్లేశం, పాశం భాస్కర్, ధనుంజయ్, పడాల శ్రీనివాస్, వట్టిపల్లి శ్రీనివాస్, చెక్క కృష్ణ, లింగస్వామి, సీఎస్ రెడ్డి, నర్ల నర్సింగ్‌రావు, డీఎల్ఎస్ గౌడ్, పడమటి జగన్మోహన్‌రెడ్డి, చందా మహేందర్ గుప్తా, పిట్టల అశోక్, సత్యనారాయణ, ఉమాశంకర్, మహేందర్, సుర్వి లావణ్య, కౌన్సిలర్లు మాయ దశరథ, బలరాం, జనగాం కవితా నర్సింహాచారి, సుమ వెంకటేశ్వర్లు, భాస్కర్, లక్ష్మణ్, కోటేష్, భిక్షపతి, కపిల్, శ్రీశైలం పాల్గొన్నారు.

సమైక్యతా సంబురం


నల్లగొండ : జాతీయ జెండాకు వందనం చేస్తున్న మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ


నల్లగొండలో పరేడ్ నిర్వహిస్తున్న పోలీసులు


నల్లగొండలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు


భువనగిరి : జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న ప్రభుత్వ విప్ సునీత, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, భువనగిరి డీసీపీ


సూర్యాపేట : జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి


సూర్యాపేటలో జాతీయ సమైక్యతా వేడుకలకు హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు


సూర్యాపేటలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు


భువనగిరిలో జాతీయ సమైక్యతా వేడుకలకు హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

మోటార్లు చోరీ చేస్తున్న నలుగురి అరెస్ట్

యాదగిరిగుట్ట: వ్యవసాయ బావుల విద్యుత్ మోటార్లు, వైర్లు చోరీకి పాల్పడుతున్న నలుగురిని పెట్రోలింగ్ పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. యాదగిరిగుట్ట పట్టణ పరిధిలోని అంగడి బజారులో నివాసం ఉంటున్న నలుగురు వ్యక్తులు శనివారం అర్ధ రాత్రి తరువాత యాదగిరిపల్లిలోని రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ బావుల వద్ద పెట్రోలింగ్ పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించారు. వెంటనే వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వ్యవసాయ బావుల వద్ద పరిశీలించగా మోటార్లు, వైర్లు చోరీ చేసినట్లు ఆనవాళ్లు కనిపించాయి. దీంతో నలుగురు దొంగలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నట్లు తెలిసింది.

ప్రయాణికురాలి వద్ద రూ.1.70లక్షలు చోరీ

చౌటుప్పల్ : ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలి వద్ద దుండగులు రూ.1.70లక్షలు చోరీ చేశారు.నల్లగొండ మండలం దోమలపల్లి గ్రామానికి చెందిన చెన్నరాజు భాగ్యయ్య ప్లాటు కొనుగోలుకు సంబంధించి డబ్బులు చెల్లించేందుకు స్వగ్రామం నుంచి శనివారం సాయంత్రం హైదరాబాద్‌కు వెళ్లింది. అనివార్య కారణాలతో చెల్లింపు ప్రక్రియ వాయిదా పడింది. దీంతో సదరు మహిళ అదే రోజు రాత్రి నగదుతో ఆర్టీసీ బస్సులో స్వగ్రామానికి బయలుదేరింది. ఆ క్రమంలో చౌటుప్పల్ మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామం వద్దకు రాగానే తన వెంట ఉన్న బ్యాగును చూసుకుంది. దాంతో బ్యాగులోని నగదు కన్పించలేదు. లబోదిబోమంటూ బస్సులో వెతికినా ప్రయోజనం కలగలేదు. దీంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నారసింహుడి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు


ముఖ మండపంలో భక్తుల క్యూ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం వారాంతపు సెలవు రోజు కావడంతో భక్తులు అధికంగా శ్రీస్వామి వారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, ప్రసాద విక్రయశాల, క్యూలైన్లు, నిత్య కల్యాణ మండపం, శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం, కల్యాణకట్ట, లక్ష్మీ పుష్కరిణి, దేవస్థానం బస్టాండ్‌లు భక్తులతో కిటకిటలాడాయి. ఇక శ్రీస్వామి వారి ధర్మదర్శనానికి సుమారు మూడు గంటల సమయం, వీఐపీ దర్శనానికి సుమారు గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. వివిధ పూజలతో నిత్య ఆదాయం రూ.40,88, 558 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

మునిపంపుల వాసికి విశ్వకర్మ అవార్డు


ముత్యాలుకు అవార్డు అందజేస్తున్న మోదీ

రామన్నపేట: మండలంలోని మునిపంపుల గ్రామానికి చెందిన తాపీ మేస్త్రీ బూడిద ముత్యాలు విశ్వకర్మ అవార్డును అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదివారం న్యూఢిల్లీలో విశ్వకర్మ పథకం ప్రారంభించింది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా 18మంది కార్మికులకు విశ్వకర్మ అవార్డులను ప్రశంసా పత్రంతో పాటు రూ.లక్ష నగదు పురస్కారం అందజేశారు. తెలంగాణ నుంచి బూడిద ముత్యాలు మాత్రమే మోదీ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. బాల్యంలోనే తల్లితండ్రులను కోల్పోయిన ముత్యాలు కుటుంబ పోషణ కోసం భవన నిర్మాణ కార్మికుడిగా మారాడు. ముత్యాలుకు అవార్డు రావడం పట్ల గ్రామ సర్పంచ్ యాదాసు కవిత హర్షం వ్యక్తం చేశారు.

‘పేట’ను హరిత జిల్లాగా తీర్చిదిద్దుతాం

- మహిళలంతా ఆరోగ్యవంతులుగా ఉండాలనేదే నా ఆకాంక్ష
- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : సూర్యాపేటను హరిత జిల్లాగా తీర్చిదిద్దుతామని రాష్ట విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి తెలిపారు. కలెక్టరేట్లోలోని సమావేశ మందిరంలో బెంగళూరుకు చెందిన పర్యావరణవేత్త డాక్టర్ శాంతి ఆధ్వర్యంలో ఋతు ప్రేమపై మహిళలకు నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలంతా ఆరోగ్యంగా ఉండాలనే ఆలోచనతో ఋతుప్రేమ కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొన్నారు. స్వచ్ఛ సూర్యాపేట కోసం చేపట్టిన పవిత్రమైన యజ్ఞానంలో అందరూ భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలుపరుస్తూ అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం ఆసరాగా ఉంటుందన్నారు. తెలంగాణ రాష్టం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అమలుపరుస్తున్న పథకాలను ప్రపంచ దేశాలు అనుసరిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజలకు మంచి వైద్య సేవలు అందించాలని ఉద్దేశంతో సీఎం కేసీఆర్ పల్లె దవఖానాలు, బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదే విధంగా ఆరోగ్య మహిళా కేంద్రాలు ఏర్పరిచి మహిళల కోసం ప్రత్యేకంగా ప్రతి మంగళవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మొక్కలు నాటడం, ప్లాస్టిక్ నిరోధించడం అందరం ఆచరించాలని మంత్రి కోరారు. ప్రపంచమంతా సూర్యాపేటని చూసి నేర్చుకునే విధంగా చేస్తానన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎస్ వెంకట్రావు, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సీహెచ్ ప్రియాంక, జెడ్పీ చైర్ పర్సన్ దీపికా యుగంధర్, మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ శ్రీనివాస్, పెన్పహాడ్ జెడ్పీటీసీ మామిడి అనిత ,చివ్వెంల ఎంపీపీ కుమారి, డిడబ్ల్యూఓ జ్యోతి పద్మ ,మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ శారద, ప్రజా ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.


సదస్సుకు హాజరైన మహిళలు

ఖద్దరు మాటున మోసం!

- ఫైరవీలు చేస్తూ మోసాలకు పాల్పడుతున్న ప్రజాప్రతినిధి
- చనిపోయిన వ్యక్తి పేరిట పంట రుణం కాజేసిన ఘనుడు
- ఓ రైతుకు రెండు బ్యాంకుల్లో పంట రుణం ఇప్పించి డబ్బులు దండుకున్న వైనం
- పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్న బాధితులు

శాలిగౌరారం: ఖద్దరు మాటున ఓ ప్రజాప్రతినిధి అటు ప్రభుత్వ సంస్థలతో అమాయకులను మోసగిస్తూ డబ్బులు దండుకుంటున్న వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శాలిగౌరారం మండలంలోని ఊట్కూరు గ్రామానికి చెందిన శివరాత్రి ఇద్దయ్యకు భార్య సావిత్రమ్మ, కుమార్తె ఉన్నారు. ఇద్దయ్యకు గ్రామంలో 1.21 గుంటలు వ్యవసాయ భూమి ఉంది. అనారోగ్యంతో ఇద్దయ్య 2013లో మృతిచెందాడు. ఇద్దయ్య మృతిచెందే వరకు ఆయన ఏ బ్యాంకులోనూ పంటరుణం తీసుకోలేదు. కానీ,ఇద్దయ్యకు శాలిగౌరారం ఎస్‌బీహెచ్(నేటి ఎస్‌బిఐ)లో క్రాప్‌లోన్ ఉందని, నీవు సంతకం చేస్తే అప్పు మొత్తం మాఫీ అవుతుందని ఇద్దయ్య భార్య సావిత్రమ్మకు ఆ పైరవీకారి, ప్రస్తుత ప్రజాప్రతినిధి నచ్చ చెప్పి వ్యవసాయ భూమికి సంబంధించిన పట్టాదారు పాసు పుస్తకాన్ని తీసుకొని బ్యాంకుకు వెళ్లాడు. బ్యాంకు సిబ్బందిని తనకు అనుకూలంగా మార్చుకున్న ఆ పైరవీకారి చనిపోయిన ఇద్దయ్య పేరుమీద పంటరుణ మంజూరీ పత్రాలపై అతడి భార్యతో వేలిముద్రలు పెట్టించి అప్పు మాఫీ జరుగుతదని చెప్పి తిరిగి ఆమెను ఇంటికి పంపించాడు. ఆ తర్వాతా చనిపోయిన ఇద్దయ్య పేరున ఆ పైరవీకారి 2015న రూ.37000లు పంటరుణం పొందాడు. గత సంవత్సరం ఇద్దయ్య పేరున బ్యాంకులో పంటరుణం ఉందని, రుణం తీర్చాలని బ్యాంకు సిబ్బంది ఇద్దయ్య భార్య సావిత్రమ్మకు చెప్పడంతో ఆందోళనకు గురైంది. బ్యాంకువారిని అడుగగా వారు రూ. 53 వేలు అప్పు ఉందని చెప్పారు. దీంతో దిక్కుతోచని ఆమె వెంటనే ఆ పైరవీకారి ఇంటికి వెళ్లి అడుగగా నాకేం తెలియదని పట్టించుకోకుండా వెళ్లిపోయాడు. బ్యాంకు అప్పు విషయంపై బాధిత మహిళ ఇటీవల బ్యాంకు మేనేజర్‌ను కలువగా ఈనెల 19న బ్యాంకుకు రమ్మని చెప్పి పంపించారు. ఇదిలా ఉండగా ప్రజాప్రతినిధి అయిన పైరవీకారి చేసిన మరెన్నో మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. వాటిలో కొన్ని...

- గ్రామానికి చెందిన ఓ రైతుకు 2.20 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా ఆయన పెర్కకొండారంలోని ఏపీజీవీబీ నుంచి ఇరవై ఏళ్లుగా క్రమం తప్పకుండా పంటరుణం పొందుతున్నాడు. ఇతనికి శాలిగౌరారం ఎస్‌బీఐ బ్యాంకులో కూడా క్రాప్‌లోన్ ఇప్పిస్తానని చెప్పి 2020లో రూ.98వేలు పంటరుణం పొందాడు. ఆ రుణాన్ని ఆరైతుకు ఇవ్వకుండా అతనికి సంబంధించిన బ్యాంకు సేవింగ్ పాస్‌బుక్ తనదగ్గర ఉంచుకొని పైరవికారి ఆ డబ్బులు తీసుకున్నాడు.
- గ్రామానికి చెందిన మరో వ్యక్తికి ఎకరం భూమి ఉంటే దానిని రెండు ఎకరాలుగా జీరాక్స్‌లు తీసి శాలిగౌరారం ఎస్‌బీఐలో 2018-19లో రూ.80 వేలు రుణం ఇప్పించి బ్యాంకు సిబ్బందికి ఇవ్వాలని రూ.20 వేలు తీసుకున్నాడు.
- ఓ మహిళ తన అవసరాల కోసం బ్యాంకులో దాచుకున్న రూ. 1.25లక్షలలో రూ.లక్ష తీసుకుంటానని బ్యాంకులో విత్ డ్రా ఫాం నింపమని కోరితే 1.20లక్షలకు ఫారం రాసిచ్చాడు. అనంతరం రూ.20వేలు ఎక్కువ వచ్చాయని, బ్యాంకులో జమచేయాలని ఆ మహిళకు చెప్పి రూ.20 కాజేశాడు. కొద్ది రోజుల తర్వాత మోసం వెలుగుచూడడంతో బ్యాంకులో జమచేశానని బుకాయించడంతో బాధితురాలు లబోదిబోమంటోంది.
- గ్రామానికి చెందిన ఓ రైతుకు బ్యాంకులో రూ. 85 వేలు రుణం వస్తే రూ.60 వేలు మాత్రమే వచ్చాయని చెప్పి రూ.25 వేలు తనజేబులో వేసుకున్నాడు. తర్వాతా ఆరైతుకు బ్యాంకు అప్పు ఎంత ఉందో తెలిసేసరికి నివ్వెరపోయాడు. ఈ విషయంపై అడిగితే తనకు ఏమి తెలియదని చెప్పి పంపించాడంటూ వాపోయాడు. సదరు పైరవీకారి, ప్రస్తుత ప్రజాప్రతినిధి మోసాలపై బాధితులు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

జిల్లాస్థాయి క్రీడలకు ఎంపిక

మోత్కూరు: మోత్కూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో పాటిమట్ల జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు వివిధ క్రీడల్లో పాల్గొని జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మన్నె అగ్గిరాములు, ఫిజికల్ డైరెక్టర్ ఎ. రామాంజమ్మ ఆదివారం విలేకరులకు తెలిపారు. కబడ్డీ అండర్ -17 బాలుర విభాగంలో కె. తనూష్‌రెడ్డి, బాలికల విభాగంలో పి. శిరీష, డి. పల్లవి, కబడ్డీ అండర్-14 బాలుర విభాగంలో ఎస్. చరణ్, బాలికల విభాగంలో డి. శ్రావణి, బి. హారిక, ఖోఖో అండర్ -14 బాలుర విభాగంలో బి. సాయికృష్ణ, ఖోఖో అండర్ -17 బాలికల విభాగంలో పి. శిరీష, బి. దీపిక, బి. హారిక, ఖోఖో అండర్-14 బాలికల విభాగంలో పి. అక్షయ, డి. శ్రావణి, ఎం. మనీషా, బి. మేఘన, గ్రీష్మా, ఎస్. ప్రణవి, వైష్ణవి, రన్నింగ్ బాలికల విభాగంలో పి. శిరీష, లాంగ్ జంప్‌లో జె. శ్రావణి, అండర్-17 విభాగంలో పి. శిరీష, లాంగ్ జంప్‌లో జె. శ్రావణి, అండర్-14 విభాగంలో డి. శ్రావణి, షార్ట్‌పుట్ అండర్-14 విభాగంలో డి. శ్రావణి ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను గ్రామ సర్పంచ్ దండెబోయిన మల్లేష్, పాఠశాల కమిటీ చైర్మన్ మర్రి గణేష్, ఉపాధ్యాయులు, లింగమల్లు, స్వప్న, నాగలక్ష్మి, వీరాచారి, కిష్టయ్య, నరేష్, ఉప్పలయ్య, కృష్ణవేణి అభినందించారు.

సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తే సహించేది లేదు

వలిగొండ: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని వక్రీకరిస్తే సహించేది లేదని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు అన్నారు. ఆదివారం వలిగొండ మండలంలోని పులిగిల్లలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రాంతంలో భూమి, భుక్తి, విముక్తి కోసం చేసిన పోరాటాన్ని బీజేపీ వక్రీకరిస్తుందని ఆరోపించారు. బీజేపీ మతోన్మాదాన్ని రెచ్చగొట్టి ప్రయోజనం పొందాలని చూస్తోందని, ఈ కుట్రలను తిప్పికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అమరవీరుల పోరాట స్ఫూర్తి నేటికీ కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, కొండమడుగు నర్సింహ, మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, సిర్పంగి స్వామి, వనం రాజు, కల్కూరి రామచందర్, కందాడి సత్తిరెడ్డి, గర్దాస్ నర్సింహ, ముత్యాలు, గూడూరు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పులిగిల్లలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

బీటెక్ విద్యార్థికి గోల్డ్‌మెడల్


గోల్డ్‌మెడల్, ప్రశంసాపత్రం అందుకుంటున్న దినేష్‌రెడ్డి

కేతేపల్లి: కేతేపల్లి మండలంలోని తుంగతుర్తి ఆవాస గ్రామం బండమీదిగూడేనికి చెందిన సూదిరెడ్డి దినేష్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీ) వరంగల్ కళాశాలలో బీటెక్ కంప్యూటర్ ఇంజనీరింగ్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించాడు. రైతు కుటుంబానికి చెందిన దినేష్‌రెడ్డి తండ్రి శేఖర్‌రెడ్డి టీఎస్ఎస్పీ మొదటి బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. తల్లి ధనలక్ష్మి గృహిణి. దినేష్‌రెడ్డి చిన్ననాటి నుంచి చదువులో చురుకుగా ఉండేవాడు. ఇంటర్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన దినేష్‌రెడ్డికి ఐఐటీలో సీటు వచ్చినప్పటికీ తల్లిదండ్రులకు దూరంగా ఉండటం ఇష్టం లేక వరంగల్ ఎన్ఐటీ కళాశాలలలో బీటెక్ కమ్యునికేషన్స్ విభాగంలో చేరాడు. బీటెక్‌లో 98శాతం మార్కులు సాధించిన దినేష్‌రెడ్డి గోల్డ్ మెడల్ సాధించాడు. శనివారం రాత్రి ఎన్ఐటీ ఆవరణలో అట్టహాసంగా నిర్వహించిన 21వ కాన్వకేషన్‌లో కళాశాల యాజమాన్యం దినేష్‌రెడ్డికి గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రం అందజేసి సత్కరించింది. దినేష్‌రెడ్డి ప్రతిభను గుర్తించిన పలు ఐటీ కంపెనీల నుంచి భారీ వేతనంతో ఆఫర్లు వచ్చాయి. ఈ క్రమంలో ప్రముఖ ఐటీ కంపనీ సేల్స్‌ఫోర్స్ యాజమాన్యం రూ.48లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం ఇచ్చింది.

సివిల్స్ సాధించి ప్రజాసేవ చేయటమే లక్ష్యం

బీటెక్‌లో గోల్డ్ మెడల్ సాధించటంలో నా తల్లిదండ్రులతో పాటు ఎన్ఐటీ ప్రొఫెసర్లు, డీన్, సహచర విద్యార్థుల ప్రోత్సాహం ఎంతో ఉంది. ప్రజాసేవకు మించిన ఉద్యోగం మరోటి లేదు. రెండేళ్ల పాటే ఐటీ రంగంలో పని చేసి అనంతరం సివిల్స్‌పై దృష్టి పెడతా. సివిల్స్ సాధించి భవిష్యత్తులో ప్రజలకు సేవలు అందించటమే లక్ష్యం. చిన్ననాటి నుంచి తనను విద్యారంగంలో ప్రోత్సాహిస్తున్న తాత సూదిరెడ్డి నర్సిరెడ్డి, నానమ్మ లింగమ్మలకు తాను సాధించిన గోల్డ్ మెడల్‌ను అంకితమిస్తున్నా. – దినేష్‌రెడ్డి

ఉత్సాహంగా స్పీడ్ స్కేటింగ్ పోటీలు


స్పీడ్ స్కేటింగ్‌లో విద్యార్థుల విన్యాసాలు

సాక్షి, యాదాద్రి : భువనగిరిలోని న్యూ డైమెన్షన్ పాఠశాలలో రోలర్ స్పీడ్ స్కేటింగ్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. సువాలి ఎస్టేట్ అధినేత, చైర్మన్ పులిమామిడి సుభాష్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ ఫస్ట్ ర్యాంకింగ్ రోలర్ స్పీడ్ స్కేటింగ్ రాష్ట్ర స్థాయి పోటీలు రెండోవ రోజు ఆదివారం కొనసాగాయి. తొలిసారిగా జరుగుతున్న ఈ స్కేటింగ్ పోటీల్లో 780 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చిన క్రీడా కారులు సెమీ ఫైనల్ వరకు చేరుకున్నారని ఆర్గనైజర్స్ తెలిపారు. కార్యక్రమంలో సువాలి ఎస్టేట్ చైర్మన్ పులిమామిడి సుభాష్ రెడ్డి, న్యూ డైమెన్షన్ పాఠశాల డైరెక్టర్ శివాణి రెడ్డి, ఇండియా స్కేటింగ్ ఫెడరేషన్ చీఫ్ భగీరథ, రాష్ట్ర అధ్యక్షుడు మదన్ మోహన్ రెడ్డి, ఆర్గనైజర్ కోచ్ రాజు, ప్రిన్సిపాల్ శ్వేతా రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన మందుల సామేల్


మందుల సామేల్‌ను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న కోమటిరెడ్డి

తిరుమలగిరి (తుంగతుర్తి) : రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ మందుల సామేల్ ఆదివారం హైదరాబాద్‌లో భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మందుల సామేల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకు మంత్రి పదవిని త్యాగం చేసిన తెలంగాణ యోధుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో తెలంగాణ విమోచన దినోత్సవం రోజున తాను కాంగ్రెస్ పార్టీలో చేరడం సంతోషం కలిగిస్తుందన్నారు. తుంగతుర్తి గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడానికి కృషి చేస్తానని అన్నారు. తనను పార్టీలోకి ఆహ్వానించిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.